క్లుప్తంగా

ప్రశాంతంగా నీట్ పరీక్ష

వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30గంటలకు వరకు జరిగిన పరీక్షకు మొత్తం 970 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 905 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవకతవకలు జరుగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డీఆర్పీగా హెచ్‌ఎం తాటిపర్తి ఎంపిక



కొడవలూరు: మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు నూతన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా రిసోర్స్‌పర్సన్(డీఆర్పీ)గా ఎంపికయ్యారు. ఆయన ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు కృష్ణా జిల్లా గుడివాడలో జనరల్ మాడ్యూల్‌పై జరిగే రాష్ట్ర స్థాయి శిక్షణకు హాజరుకానున్నారు. అనంతరం ఈ నెల 15 నుంచి జిల్లా స్థాయిలో జరిగే డీఎస్సీ 2018, డీఎస్సీ2008, డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని శిక్షణ ఇవ్వనున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కొడవలూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. నాయుడుపాళేనికి చెందిన బొందు నరసింహయ్య(32) వారం రోజుల క్రితం బైక్‌పై నార్సురాజుపాళేనికి హైవేపై వస్తుండగా, గ్రామ సమీపంలో వెనుకగా కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహయ్య తీవ్రంగా గాయపడగా నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహయ్య శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఎస్సై జీ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్): జిల్లాలో డిజిటల్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ – 6 అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహణాధ్యక్షుడు మణి కోరారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ – 6 అసోసియేషన్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మస్తాన్, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా షరీఫ్, విష్ణు, కోశాధికారిగా తనీర్, నిర్వహణ కార్యదర్శులుగా లోకేష్, సతీష్, ఈసీ మెంబర్లుగా అహ్మద్, నాగయ్య, కిశోర్‌ను ఎన్నుకున్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని చక్రాల వారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వేదపండితుడు హేమంత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఇనమడుగు సత్యానంద ఆశ్రమవాసి పురుషోత్తమ తీర్థస్వామి, కోటేశ్వరశర్మ, శ్రీనివాసులు పర్యవేక్షించారు. ట్రస్ట్ నిర్వాహకులు వెంకటలక్ష్మీనరసింహం, ఆనంద్‌కుమార్, భారతి, రాజేంద్రప్రసాద్, రాజు, గిరిజ, భువనేశ్వరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైటీ మిత్ర ఫౌండేషన్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): రాష్ట్రపతి అవార్డు గ్రహీత వైటీ మిత్ర ఫౌండేషన్‌ను సుబేదారుపేటలోని ఏబీఎం స్కూల్లో గల వైటీ మిత్ర కాంపౌండ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్ మాట్లాడారు. సామాజిక సేవలో అపార అనుభవం గల మిత్ర.. ఫౌండేషన్‌ను ప్రారంభించడాన్ని అభినందించారు. అనంతరం మిత్ర మాట్లాడారు. సుబేదారుపేట, ఏబీఎం కాంపౌండ్, తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేసేవారు అధికంగా ఉన్నారని, వీరి కోసం అల్పాహారాన్ని ప్రతి ఆదివారం ఉదయం అందజేయనున్నామని చెప్పారు. భిక్షాటన చేసేవారికి వైద్య పరీక్షలను డాక్టర్లు సుందర్, విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేసవి దృష్ట్యా దాహార్తిని తీర్చేందుకు కుళాయిని ఏర్పాటు చేశారు. పలువురికి దుస్తులను అందజేశారు. అమృతబాయి మిత్ర, విశ్రాంత ఆర్జేడీ డాక్టర్ రాజకుమారి, కస్టమ్స్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్, విశ్రాంత అధ్యాపకుడు దయాకర్, రెవరెండ్ జొనాథన్, సుకేశిని నోబుల్, దినకర్, సునీల్, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

తోడేరు వల్లే రాజకీయంగా ఎదిగా

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



తోడేరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తన స్వగ్రామమైన తోడేరు ప్రజల సహకారంతోనే రాష్ట్ర మంత్రి స్థాయికి రాజకీయాల్లో ఎదగ గలిగానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తోడేరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కాకాణి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తోడేరు ప్రజలు ఏకతాటిపై నిలబడి తన రాజకీయ భవిష్యత్తు కోసం కృషి చేశారని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి పొదలకూరు సమితి అధ్యక్షుడిగా పనిచేస్తే, తన తల్లి లక్ష్మీకాంతమ్మ తోడేరు సర్పంచ్‌గా చాలాకాలం కొనసాగారని తెలిపారు. తమ రాజకీయాభివృద్ధికి కృషి చేసిన గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. గ్రామంలో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందే గిరిజనులకు సొంత నిధులతో ఇళ్లు నిర్మించి అందజేశామన్నారు. తిరిగి వారికి ప్రభుత్వం అందజేసే రూ.1.80 లక్షలతో పాటు అదనంగా అయ్యే ఖర్చును తాను వ్యక్తిగతంగా భరించి కాంట్రాక్టర్ ద్వారా ఇళ్లను నిర్మించి అందజేస్తామన్నారు. గ్రామస్తులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా తనదిగా భావించి ఆదుకుంటామన్నారు. కాగా గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున మంత్రి కాకాణి వెంట నడిచి ఘనస్వాగతం పలికారు.

లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

తోడేరు చట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా తోడేరులో సబ్‌స్టేషన్‌ను నిర్మించామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. తోడేరులో రూ.2.60 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తిరుపతి ఎంపీ గురుమూర్తి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మంత్రి కాకాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రైతులు ఎంతోకాలంగా నాణ్యమైన విద్యుత్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసురెడ్డి, ఇప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండదండలతో తోడేరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించామన్నారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి తోడేరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కలలు కనేవారని, ఆయన కలలను సాకారం చేసేందుకు తాను కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటయ్యాయని, పీహెచ్‌సీని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రైతుల లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి తన తండ్రి కోరిక మేరకు సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించామని తెలిపారు. తన తండ్రి ద్వితీయ వర్ధంతి నాడు సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాలనే కోరిక మేరకు విద్యుత్ అధికారులు ఎంతో శ్రమించి సకాలంలో ఛార్జ్ చేశారని వెల్లడించారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, బల్లి కల్యాణచక్రవర్తి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, విద్యుత్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ఈఈ కన్‌స్ట్రక్షన్ జయకృష్ణారెడ్డి, డీఈ శ్రీధర్‌రెడ్డి, ఈఈ ఎంఅండ్‌పీ పరంధామయ్య, ఈఈ ట్రాన్స్‌ఫార్మర్స్ మధుసూదన్‌రెడ్డి, ఈఈ డీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏడీఈలు ప్రభాకర్, బీ సురేంద్రబాబు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీపీ సుబ్బరాయుడు, ఎంపీడీఓ నగేష్ కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు కసనానాయక్, వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బిరదవోలు మహేంద్ర, సర్పంచ్ పెంచలమ్మ, ఉపసర్పంచ్ ఎం శ్రీనివాసులు, ఎంపీటీసీ సుగుణ, మాజీ సర్పంచులు ఏనుగు శశిధర్‌రెడ్డి, ఏ రవీంద్ర, నేతాజీ సుబ్బారెడ్డి, ఏనుగు శేఖర్‌రెడ్డి, ఒంటేరు కిషోర్, యజ్ఞాని, తదితరులు పాల్గొన్నారు.

ఎడగారుకు సాగునీరు విడుదల



ఈస్ట్రన్ ఛానల్‌కు సాగునీరు విడుదల చేస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: కనిగిరి రిజర్వాయర్ నుంచి ఎడగారుకు సాగునీటిని ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ డీఈ మధు మాట్లాడుతూ కనిగిరి రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న ఈస్ట్రన్ ఛానల్‌లో పూడికతీత పనులు పూర్తవడంతో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. ఈ కాలువ ద్వారా బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, విడవలూరు మండలాల్లోని పొలాలకు సాగునీరు అందుతుందని వివరించారు. కాలువకు అనుసంధానంగా ఉన్న కాలువల్లో ఎక్కడైన పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

వినాయకుడి గుడి నిర్మాణానికి భూమి పూజ



కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు మజరా శ్రీనివాసపురంలో వినాయకుడి ఆలయ నిర్మాణానికి ఆదివారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్కా మనోహర్‌బాబు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10 లక్షలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుకు సహకారం అందించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఉపసర్పంచ్ చక్కా శైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు వేముల వెంకటేశ్వర్లు, శూలం హరిబాబు, చక్కా రామయ్య, వీ రమణయ్య, విడవలూరు వెంకటేశ్వర్లు, వీరయ్య, రాఘవేంద్ర, పద్మయ్య, దశయ్య, సురేష్, నవీన్, కే శేషగిరి, కే.రమేష్, మాల్యాద్రి పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజాసేవకుడు రమణారెడ్డి



నివాళులర్పిస్తున్న ఎంపీ ఆదాల




శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- తిరుపతి ఎంపీ గురుమూర్తి

పొదలకూరు : నాటి తరంలో నిస్వార్థ ప్రజాసేవకుడిగా, 18ఏళ్లు సమితి అధ్యక్షుడిగా కాకాణి రమణారెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారని తిరుపతి ఎంపీ ఎం గురుమూర్తి పేర్కొన్నారు. తోడేరులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి కాకాణి రమణారెడ్డి ద్వితీయ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణచక్రవర్తి, మేరిగ మురళీధర్, చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ రమణారెడ్డి వద్దకు ఎవరు వెళ్లిన ఆప్యాయంగా పలుకరించేవారన్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ కాకాణి కుటుంబంతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. రాజకీయాల్లో తాను జూనియర్ అయినప్పటికీ కాకాణి కుటుంబం తన వెన్నంటి నడిపించిందన్నారు. పెద్దాయన రమణారెడ్డి ఎమ్మెల్యే కాలేకపోయినా ఆయన కుమారుడు రెండు పర్యాయాలు ఎమ్మెల్యే, మంత్రి అయ్యారని తెలిపారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ తన తండ్రి తొలిసారిగా గూడూరు ఎమ్మెల్యేగా బరిలో నిలబడిన నాటి నుంచి కాకాణి కుటుంబంతో తమకు సంబంధాలు ఉన్నాయన్నారు. మంత్రి గోవర్ధన్‌రెడ్డి తన వెన్నంటి నడిపిస్తున్నారని ఆయన రుణం తీర్చుకోలేనిదన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కాకాణి రమణారెడ్డి మెట్టప్రాంతంలో విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు.ఆయన్ని రాజకీయాల్లో ఆదర్శంగా తీసుకుని ముందుకు నడిచినట్లు తెలిపారు. ఎన్‌డీసీసీ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పెద్దాయన నేటి తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. విలువలు, విశ్వసనీయతలో ఆయన ఏనాడు రాజీపడకుండా ఐదు దశాబ్దాలపాటు రాజకీయాలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో రౌడీషీటర్ల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై బీర్ బాటిల్‌తో దాడి చేసి బంగారు ఉంగరం, నగదును దోచుకెళ్లిన ఘటనలో ముగ్గురు రౌడీషీటర్లను చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు వెల్లడించారు. నేతాజీనగర్‌కు చెందిన జాషువా గత నెల 30న తన స్నేహితులతో కలిసి జెడ్పీ సెంటర్‌లోని గోల్డెన్ గ్రాండ్ లాడ్జిలో ఉన్నారు. ఈ క్రమంలో రౌడీషీటర్లయిన బోగోలు మండలం బిట్రగుంటకు చెందిన షాహుల్ హమీద్, కోటమిట్టకు చెందిన జలీల్, ఖైజర్ లాడ్జిలోకి ప్రవేశించి జాషువాపై బీర్ బాటిల్‌తో దాడి చేసి చంపుతామని బెదిరించారు. అతని చేతికున్న 8గ్రాముల బంగారు ఉంగరం, జేబులో ఉన్న రూ.450ను దోచుకున్నారు. విషయాన్ని బయట చెప్తే చంపుతామని బెదిరించి పరారయ్యారు. గాయపడిన జాషువాను జీజీహెచ్‌లో స్నేహితులు చేర్పించారు. ఘటనపై అదే రోజు రాత్రి చిన్నబజార్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మన్సూర్‌నగర్ ఆర్చి వద్ద నిందితులను శనివారం అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా, నేరం చేశామని నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి బంగారు ఉంగరం, రూ.200ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రసన్న విశ్వేశ్వరుడికి గంధపడి ఉత్సవం

ఇందుకూరుపేట: మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరుడికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గంధపడి ఉత్సవాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆదిదంపతులను విశేషంగా అలంకరించి ఏకాంత సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా వల్లూరు కృష్ణయ్య,అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

నేడు,రేపు గడప గడపకు మన ప్రభుత్వం

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం సచివాలయం పరిధిలో సోమ, మంగళవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



నెల్లూరు(బృందావనం): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని భక్తవత్సలనగర్‌లోని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ చైర్మన్ శ్రీరామరాజు, రఘు, రాజారెడ్డి, రామయ్య, రాయప్ప, రాజేష్‌రాజు, మురళీమోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగంతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడి వాహనాలపై దూసుకెళ్లింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిన ఘటన వెంకటరమణ హోటల్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే స్పందించి ఆటోలో ఉన్న వ్యక్తులను బయటకు తీశారు. ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ఉన్నవారు పూటుగా మద్యం సేవించి ఉన్నారు.సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

గడప గడపకు మన ప్రభుత్వం గొప్ప కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకోవడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన గడప గడపకు మన ప్రభుత్వం గొప్ప కార్యక్రమమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పడుగుపాడు పంచాయతీ పరిధిలోని వాగుమిట్ట, డీసీఎస్ నగర్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలోని 59 సచివాలయాల పరిధిలో 69,348 గడపలను సందర్శించినట్లు తెలిపారు. తద్వారా ఒక్కో ఇంటికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఏ మేర లబ్ధి చేకూరిందో తెలుసుకునేందుకు వీలు కలిగిందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. అనిల్‌కుమార్ చొరవతో జాతీయ రహదారి అభివృద్ధి తన సోదరుడు, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మంత్రిగా ఉన్న సమయంలో పడుగుపాడు పాత జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని, అందుకు మీరు సహకరిస్తే ఢిల్లీ స్థాయిలో అన్ని తాను చూసుకుంటానని చెప్పడం జరిగిందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తాను చెప్పిన వెంటనే రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించి అందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి కృషి చేశారన్నారు. జాతీయ రహదారి అభివృద్ధికి నిధులు కేటాయింపునకు కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఇద్దరికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున రూ.40 వేలు నగదు సాయం అందజేశారు. ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట



బుచ్చిరెడ్డిపాళెం: దామరమడుగు పంచాయతీ పరిధిలోని పల్లిపాళెంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట, అన్నప్రసాద వితరణ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, వినోద్, ప్రదీప్, నాగేంద్ర, బాస్కర్‌రెడ్డి, ప్రమీలమ్మ, హరి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మనుబోలు: పిడూరులో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ విజేతకు రూ.15 వేలు, రన్నరప్‌కు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్ అవార్డులు అందజేస్తామన్నారు. టోర్నమెంట్ స్పాన్సర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రవితేజారెడ్డి పిడూరు క్రికెట్ జట్టుకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఆర్గనైజర్లుగా వినయ్, వేణు, వెంకి, శ్రీహరి వ్యవహరిస్తున్నారు.

కనులపండువగా రథోత్సవం





నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని విశేషంగా అలంకరించి నరసింహకొండ కింది భాగంలోని దేవరపాళెంలో రథోత్సవాన్ని జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా రామచంద్రారెడ్డి, భారతి, శ్రీకళ, మాధవీలత వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రథోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని దేవరపాళెంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా



కే సాయిభార్గవి



ఆర్ తేజస్విని



మనోజ్ఞ ప్రభవ



ఆలపాక మౌలిక



పిట్టి మానస

పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పదోతరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాల విద్యార్థిని ఏ వైష్ణవి 592 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాలకు చెందిన తేజస్వినీ 584, సాయిభార్గవి 582 మార్కులను సాధించారు. తోడేరు కేఎస్ జెడ్పీహైస్కూల్ విద్యార్థి మానస 547, తోడేరు వైకేకే జెడ్పీహైస్కూల్ విద్యార్థి సాయిత్రిష 579, ఇనుకుర్తి జెడ్పీహైస్కూల్ విద్యార్థి జీ నవ్యశ్రీ 541, పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి వీ రేష్వంత్ 515 మార్కులు సాధించి ఆయా పాఠశాలలకు గుర్తింపు తీసుకొచ్చారు.

ముత్తుకూరు: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆయా పాఠశాలలకు గుర్తింపుతెచ్చారు. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆలపాక మౌలిక 572, బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మనోజ్ఞ ప్రభవ 565, ముత్తుకూరు గురుకుల పాఠశాల విద్యార్థిని లిఖిత 565, ఎన్ అమృత 554 మార్కులతో ప్రతిభకనబరిచారు.

చిన్నచెరుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో 12 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 12 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో ఆరుగురు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు.

తండ్రికి ఆరోగ్యం సరిలేకపోయినా..

చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలకు చెందిన పిట్టి మానస 542 మార్కులతో సత్తా చాటింది. ముంగళదొరువు గ్రామానికి చెందిన పిట్టి మస్తానయ్య–చెంచురత్నమ్మ కుమార్తె మానస. ప్రైవేట్ ఉద్యోగి అయిన మస్తానయ్య ఆరోగ్యం గత కొంత కాలంగా సరిగా లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మానస కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంది.

బుచ్చిరెడ్డిపాళెం: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ హవా చాటారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి టాపర్లుగా నిలిచారు. బుచ్చిరెడ్డిపాళెం బాలికోన్నత పాఠశాల విద్యార్థులు 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థిని షేక్ రిహానా 583 మార్కులతో మండల టాపర్‌గా నిలువగా, ఎస్‌వీఎన్ సాయిచందన 582 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. రేబాల ఉన్నత పాఠశాల విద్యార్థి ఓ అక్షయ 575 మండలంలో తృతీయ స్థానంలో నిలిచారు.